సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



భక్తికి ప్రతీక.. మతసామరస్యానికి వేదిక

కమలాపురం దర్గాలో 5వ తేదీ నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. -8లో..



'జగనన్నే మా భవిష్యత్'

'జగనన్నే మా భవిష్యత్' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా తెలిపారు. -8లో..



ఆటో, కారు ఢీ- తల్లీబిడ్డలు మృతి

ఆటో, కారు ఢీకొనడంతో తల్లీబిడ్డలు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. -8లో..

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సహర్ గురు (ఉ॥)
కడప	6.31	4.54
ప్రొద్దుటూరు	6.29	4.57
పులివెందుల	6.33	5.03

న్యూస్‌రీల్

9న చదరంగం ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో ఈనెల 9వ తేదీన వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల చదరంగం చాంపియన్‌షిప్-2023 ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆల్ కడప చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, చీఫ్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్‌నాయుడు తెలిపారు. అండర్-7 నుంచి అండర్-19, ఓపన్, మహిళల విభాగం పోటీలు, ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 7799030719 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ట్రిపుల్ ఐటీయన్లకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

వేంపల్లె : మండల పరిధిలోని ఇడుపులపాయ ఆర్జీయూకేటీ ప్రాంగణంలో మంగళవారం ఈ 4 విద్యార్థులకు హెటిరో డ్రగ్స్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ ఇంటర్వ్యూలకు 19 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం కింద రూ.3.50 లక్షలు ఇవ్వనున్నారన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారులు నాగరత్న కిశోర్, సుందర్ శ్రీనివాస్, రవిబాబు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: ఏపీఆర్ఎస్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఆర్ఈఓ సొసైటీ ప్రిన్సిపాల్ అండ్ కన్వీనర్ అబ్దుల్ రసూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా ముక్కవారిపల్లె ఏపీఆర్ఎస్ బాలుర, మైలవరం బాలికల, కడప ఏపీఆర్ఎస్ మైనార్టీ బాలుర, వేంపల్లి బాలికల గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే 6,7,8 తరగతులలో మిగిలి ఉన్న ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు గడువు ఈనెల 24వ తేదీతో ముగుస్తుందన్నారు. హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అన్ని తరగతులకు మే 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 77801 79446, 97011 33148 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

నేడు జగ్జీవన్‌రామ్ జయంతి

కడప సిటీ : కలెక్టరేట్‌లోని స్పందన హాలులో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంఘ నాయకులు, అధికారులు, అనధికారులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పకడ్బందీగా పది పరీక్షలు



మాట్లాడుతున్న మార్తల వెంకట కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని పది పరీక్షల జిల్లా అబ్జర్వర్ మార్తల వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై ఎంఈఓలకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలను ఈ ఏడాది నో మొబైల్ జోన్‌గా ప్రకటించామన్నారు. పరీక్ష విధుల్లో పాల్గొనే సీఎస్‌లు, డీఓలతోసహా సిబ్బంది అంతా సెల్‌ఫోన్స్‌ను ఇంటివద్ద ఉంచి రావాలన్నారు. పరీక్ష పూర్తి అయిన తర్వాత ఇన్విజిలేటర్లు జవాబు పత్రాలను వరుస క్రమంలో తీసుకున్న తర్వాతనే విద్యార్థులను బయటకు పంపాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎగ్జామినేషన్ యాక్ట్ 25 అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాఘవ రెడ్డి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేసుతోపాటు ఎంఈఓలు పాల్గొన్నారు.

రారండోయ్.. రాములోరి పెళ్లికి

ఏకశిలానగరం.. కానీ ఓరుగల్లు కాదు..
తెలుగునాట సీతారామలక్ష్మణులు
కొలువుదీరిన పుణ్యధామం..
కానీ భద్రాద్రి కాదు
వాల్మీకి రామాయణంలో కనిపించనిది..
వెన్నెల వెలుగుల్లో మురిపించేది..
ఒకే క్షేత్రం. అదే ఒంటిమిట్ట!
ఆంధ్రప్రదేశ్‌లో అపర భద్రాచలంగా
పేరొందిన ఈ దివ్యక్షేత్రం సీతారాముల
కల్యాణానికి సర్వాంగ సుందరంగా
ముస్తాబు అయింది.

- నేడు ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం
- తరలిరానున్న ప్రముఖులు, భక్తులు



విద్యుద్దీప కాంతుల మధ్య ఒంటిమిట్ట కోదండ రామాలయం

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లాలో ఉంది ఒంటిమిట్ట. చుట్టూ కొండలు, పచ్చని పంటపొలాల మధ్యలో ఉంటుంది ఇక్కడి కోదండ రామాలయం. అపురూప శిల్పసంపదతో అలరారుతున్న ఈ దేవాలయ నిర్మాణంలో చోళరాజులు, విజయనగర రాజులు, మట్లి రాజుల కళా వైభవం కనిపిస్తుంది. రాజగోపురాలపై అందమైన శిల్పాలు కనువిందు చేస్తాయి. ఆలయ మంటపంలోని ప్రతి స్తంభం ఒక కళా రూపాన్ని ప్రదర్శిస్తుంది.

చతుర్దశి నాడు.. పున్నమి వెలుగుల్లో కల్యాణం

ఏకశిలానగరి కోదండ రామాలయంలో శ్రీ రామనవమి రోజు కాకుండా పండు వెన్నెల రోజు సీతారాముల కల్యాణం జరుగుతుంది. ఆ మేరకు బుధవారం రాత్రి రామయ్య పెళ్లి జరగనుంది. చిన్నతనం నుంచి దాశరథికి 'చంద్రుడు' అంటే ఇష్టం. చిరుప్రాయంలో ఆకాశంలో చంద్రున్ని చూపిస్తేనే ఆహారాన్ని ఆరగించేవాడు. రఘురాముడు చైత్ర శుద్ధ నవమి నాడు పునర్వసు నక్షత్రంలో విళంబి నామ సంవత్సరంలో జన్మించాడు. ఆయన వివాహ మహోత్సవాలు అన్ని ఆలయాల్లోనూ నవమి నాడే అభిజిత్ లగ్నంలో నిర్వహిస్తారు. భద్రాచలం రామ క్షేత్రంలో, తిరుపతి కోదండ రామాలయంలోనూ దాదాపు అన్ని చోట్ల చైత్ర శుద్ధ పాడ్యమి నుంచి ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. నవమి నాటి కల్యాణంతో ముగుస్తాయి. ఇలా అనేక చోట్ల పగలు రామయ్య పెళ్లి జరిగితే ఒక ఒంటిమిట్టలోనే రాత్రి వేళ నిర్వహిస్తారు. ఈ సంప్రదాయం ఇప్పటిది కాదు. ఆలయ దివ్య దర్శనం ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇలాగే జరుగుతోంది.

- కోదండ రాముడు సూర్య వంశీయుడు. స్వయం ప్రతాపం కలిగినవాడు. శత్రువులు కన్నెత్తి చూడజాలని తేజం ఉన్న వాడు. ప్రజల్ని కన్నబిడ్డల్లా చూడాలంటే ఆయన ముఖంలో వెన్నెల కురవాలి. ప్రసన్నత, చల్లదనం కావాలి. ప్రజల్ని చల్లగా పాలించి శ్రీరాముడు శ్రీ రామచంద్రుడయ్యాడు. తన పేరు శ్రీరాముడికి తోడైనందుకు చంద్రుడు ఉబ్బిపోయేవాడు. దేశమంతటా జరిగే శ్రీరామ బ్రహ్మోత్సవాల్లో శ్రీరాముడి కల్యాణాన్ని చూసే అవకాశం చంద్రుడికి లేకుండా పోయింది. బ్రహ్మోత్సవాలకు అధినాయకుడైన బ్రహ్మకు తన ఆవేదనను నివేదించుకొన్నాడు. ఆమేరకు బ్రహ్మ ఏకశిలానగరిని వేదికగా నిర్ణయించాడు. చతుర్దశి రాత్రి కళాపూర్ణుడైన చంద్రుడు సీతారామ కల్యాణాన్ని పరమానందంతో తిలకిస్తాడు.



కల్యాణానికి వేదిక వద్ద పూర్తయిన ఏర్పాట్లు

నేడు ట్రాఫిక్ మళ్లింపు

ఒంటిమిట్ట/కడప అర్బన్: ఒంటిమిట్టలో బుధవారం సీతారాముల కల్యాణం జరగనున్న నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ట్రాఫిక్ మళ్లిస్తామన్నారు. కడప నుంచి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం అలంఖాన్ పల్లి జంక్షన్ నుంచి ఊటుకూరు సర్కిల్, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్లాలి.

- తిరుపతి నుంచి కడప వైపు వచ్చే భారీ వాహనాలు, రవాణా వాహనాలు రేణిగుంట నుంచి వయా రాయచోటి మీదుగా కడపకు చేరుకోవాలి.
- రాజంపేట వైపు వెళ్లే భారీ వాహనాలు రాయచోటి మీదుగా వెళ్లాలి.
- రాజంపేట నుంచి వచ్చే ద్విచక్రవాహనాలను సాలాబాద్ నుంచి ఇబ్రహీంపేట, మాధవరం మీదుగా దారి మళ్లిస్తారు.

మోహినీ అలంకారంలో జగన్మోహనుడు



ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం ఉదయం మోహినీ అలంకారంలో రాముల వారు జగన్మోహనాకారుడిగా దర్శనమిచ్చాడు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 11 నుంచి 12 వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరాముడికి అభిషేకం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిపారు. రాత్రి 7 గంటల నుంచి నృత్యాలు, కోలాటాలు, భజనల నడుమ గరుడ సేవ కనుల పండువగా సాగింది. రామయ్య పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమం ఆలయ టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో జరిగింది.

హాజరు నమోదు కచ్చితంగా ఉండాలి

కడప సిటీ : జిల్లాలో వార్డు, విలేజ్ సెక్రటేరియేట్ పరిధిలో ఉన్న గర్భిణీలు, బాలింతల ఎనీమియా నమోదు తప్పనిసరిగా ఉండడంతోపాటు హాజరు శాతం కూడా నమోదు చేయాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ఐసీడీఎస్ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాలలోపు పిల్లల్లో విటమిన్ లోపం ఉన్న వారిని గుర్తించి వారి ఆరోగ్యం బాగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా పిల్లల హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

సబ్సిడీ పట్టు.. సిరులు కురిసేట్టు

- లాభదాయకంగా పట్టు పురుగుల పెంపకం
- పెరుగుతున్న మల్బరీసాగు
- భారీగా పెరిగిన పట్టుగూళ్ల ధరలు
- ఏడాదికి రూ. లక్షకు పైగా ఆదాయం
- సిల్క్ సమగ్రలో లబ్ధిదారులకు సబ్సిడీ
- రాష్ట్రీయ కృషి వికాస్‌యోజన్‌లో మరింత మందికి లబ్ధి

కడప అగ్రికల్చర్: మల్బరీ సాగు రైతుల ఇంట సిరులు కురిపిస్తోంది. రెండేళ్లుగా ఇతర ప్రాంతాల నుంచి దిగుబడులు లేకపోవడంతో దేశీయ పట్టుకు బాగా డిమాండ్ పెరిగింది. దీంతోపాటు పట్టు ధరలు నిలకడగా ఉండటంతో రైతులకు మరింత ఆదాయం చేకూరుతోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని ఆర్జించే పట్టు సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ సిల్క్ సమగ్ర-2లో లబ్ధిదారులకు సబ్సిడీతోపాటు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన్‌లో మరింత మందికి సబ్సిడీ ఇస్తుండటంతో రైతులు మల్బరీసాగుకు ఆసక్తి చూపుతున్నారు.

- ఒక సారి మల్బరీ సాగు చేస్తే 15 నుంచి 20 ఏళ్లపాటు వెనక్కు చూడాల్సిన పనిలేదు. ప్రతి ఏటా రాబడే ఉంటుంది. దీంతోపాటు సెరికల్చర్ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ మరింతగా ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో మల్బరీసాగు ఏటా పెరుగుతోంది.

జిల్లాలో ఈ ఏడాది 223 ఎకరాల్లో సాగు..

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 223 ఎకరాల్లో రైతులు మల్బరీ సాగు చేశారు. ఇందులో కడప సాంకేతిక సేవా కేంద్రం (టీఎస్‌సీ) పరిధిలో 24.70 ఎకరాలు, బద్వేల్ టీఎస్‌సీ పరిధిలో 40 , కమలాపురం టీఎస్‌సీ పరిధిలో 74.18 , పులివెందుల టీఎస్‌సీ పరిధిలో 84 ఎకరాల్లో మల్బరీసాగు చేశారు. పట్టుపురుగుల పెంపకంలో పని తక్కువగా ఉండటంతో చాలా మంది రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఉదయం 6 నుంచి 7 గంటల సమయంలో ఒక మేత, సాయంత్రం 6-7 గంటల సమయంలో మరోమేత వేస్తారు. అలాగే చాకీ పురుగులు తెచ్చుకున్న 22 రోజులు అయిన తర్వాత పంట పూర్తి అయి మార్కెట్‌లో పట్టును అమ్మి డబ్బులు తెచ్చుకోవచ్చు. ఈ విధంగా ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తుడికి నెల నెలా జీతం డబ్బులు ఎలా వస్తాయో 2.5 ఎకరాల్లో పట్టు పురుగు పెంపకం చేపట్టిన పట్టు రైతు మిగతా అన్ని పనులు చేసుకుంటూ ప్రతి 22 నుంచి 25 రోజుకు ఆదాయం తీసుకోవచ్చు.



కిసాన్ నర్సరీ స్కీం కింద ఓ రైతు పెంచుతున్న నర్సరీ

దళారీ వ్యవస్థలేదు... తరుగు ఉండదు...

పట్టు గూళ్ల అమ్మకాల్లో ఎటువంటి దళారీ వ్యవస్థ ఉండదు. దీంతోపాటు తూకాల్లో తరుగులు అసలే ఉండదు. జిల్లాలోని వనిపెంటలోని ప్రభుత్వ చాకీ సెంటర్ నుంచి గానీ లేక మదనపల్లెలోని ప్రైవేటు చాకీ సెంటర్‌లో చాకీ పట్టుపురుగులను తెచ్చుకున్న తర్వాత కేవలం 15 రోజులకు మేత వేసిన తర్వాత పట్టు గూళ్లు కడతాయి. ఆ తర్వాత 5 రోజులకు గూళ్లు నేత్రికల నుంచి తీసి మనకు నచ్చిన చోట ప్రభుత్వ మార్కెట్‌లో అమ్ముకోవచ్చు. ఈ మార్కెటింగ్ ద్వారా మనకు నచ్చిన ధరకే అమ్ముకోవచ్చు. ఈ మార్కెట్ రాష్ట్రంలోని హిందూపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లెలో ఉన్నాయి. సరుకు అమ్మిన రోజే మనకు రావాల్సిన డబ్బు నగదు రూపంలో లేదా అకౌంట్‌కు జమ చేయడం జరుగుతుంది.

నాలుగు రోజుల క్రితం కిలో రూ. 550తో..



నాలుగు రోజుల క్రితం కిలో పట్టు గూళ్లు రూ. 550 అమ్ముకుని వచ్చాను. 100 పట్టుగూళ్లకు 110 కేజీలు పండించి కదిరి మార్కెట్‌లో అమ్ముకుని వచ్చాను. 110 కిలోలకు రూ. 60,500 వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

– బ్రహ్మయ్య, రైతు, తొండూరు

గతం కంటే అధికంగా సబ్సిడీ....



మల్బరీ సాగుకు ప్రభుత్వం సబ్సిడీలను పెంచింది. గతంలో యూనిట్ నెలకొల్పడానికి రూ. 14 వేలు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ. 25 వేలకు పెంచారు . అలాగే ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 75 శాతం సబ్సిడీ అందిస్తుంది.

– అన్నపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి

సిల్క్ సమగ్ర-2 పథకంలో యూనిట్ ఏర్పాటుకు సబ్సిడీ ఇలా..

ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీ ఇవ్వనుండగా ఓసీ, బీసీ ఇతరులకు 75 శాతం సబ్సిడీతో రుణాలు ఇస్తున్నారు.



ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ ఇలా...

యాక్టివిటి	యూనిట్‌కాస్ట్	కేంద్రం	రాష్ట్రం	మొత్తం
మల్బరీ ప్లాంటేషన్	రూ.25,000	రూ.16,250	రూ. 6250	రూ. 22,500
షెడ్ నిర్మాణం	రూ. 4,00,000	రూ. 2,60,000	రూ.1,00,000	రూ.3,60,000
పరికరాలు	రూ.75,000	రూ.48,500	రూ.18,650	రూ.67,150
క్రిమి సంహారానికి	రూ.5000	రూ. 3250	రూ. 1250	రూ.4500
ఓసీ, బీసీ, ఇతరులకు				
మల్బరీ ప్లాంటేషన్	రూ.25,000	రూ.12,500	రూ.6250	రూ.18750
షెడ్ నిర్మాణం	రూ. 4,00,000	రూ. 2,00,000	రూ.1,00,000	రూ.3,00,000
పరికరాలు	రూ.75,000	రూ.37,500	రూ.18750	రూ.56,250
క్రిమి సంహారానికి	రూ.5000	రూ.2500	రూ. 1250	రూ. 3750

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో సబ్సిడీ ఇలా...

ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీ ఇస్తుండగా ఓసీ, బీసీ ఇతరులకు 50 శాతం సబ్సిడీతో రుణాలు ఇస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ ఇలా...

యాక్టివిటి	యూనిట్‌కాస్ట్	ఆర్‌కేవైసీ	లబ్ధిదారుడి వాటా
కూలింగ్ సిస్టమ్	రూ.25,000	రూ. 22,500	రూ. 2,500
రీడింగ్ షెడ్లు, ప్లాస్టిక్ నేత్రికలు	రూ.15,000	రూ.13,500	రూ.1,500
ఫామ్‌పాండ్స్	రూ.1,50,000	రూ.1,35,000	రూ.1,500
షోలార్‌లైట్స్	రూ.50,000	రూ.45,000	రూ.5,000
పామ్ మెకనైజేషన్	రూ.1,00,000	రూ. 90,000	రూ.10,000
ఓసీ, బీసీ, ఇతరులు....			
కూలింగ్ సిస్టమ్	రూ.25,000	రూ. 12,500	రూ. 12,500
రీడింగ్ షెడ్లు, ప్లాస్టిక్ నేత్రికలు	రూ.15,000	రూ. 7,500	రూ.7,500
పామ్‌పాండ్స్	రూ.1,50,000	రూ.75,000	రూ.75,000
షోలార్‌లైట్స్	రూ.50,000	రూ.25,000	రూ.25,000
పామ్ మెకనైజేషన్	రూ.1,00,000	రూ. 50,000	రూ.50,000

పింఛన్..తలుపు తట్టెన్

- జిల్లాలో మొత్తం 2,54,089 మందికి పింఛన్‌లు

కడప రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక కింద జిల్లాలో పింఛన్‌ల పంపిణీ ప్రక్రియ జరుగుతోంది. మంగళవారం ఆయా ప్రాంతాల్లోని వలంటీర్లు అర్హుల ఇంటింటికీ వెళ్లారు. తలుపు తట్టి 'అవ్వా..తాతా' అంటూ ఆప్యాయంగా పలకరించారు. ఆరోగ్య కుశల ప్రశ్నలు వేశారు. ఇంటి గుమ్మం వద్ద వలంటీర్లను చూసిన పండుటాకుల్లో చిరునవ్వు తొణికిసలాడింది. అనంతరం వలంటీర్లు పింఛన్ నగదును అందజేశారు. మొత్తం 2,54,089 మంది పింఛన్లకు గాను మొత్తం రూ. 70,12,26,750 పంపిణీకి శ్రీకారం చుట్టారు.

నా మనవడు జగనయ్య చల్లగా ఉండాలయ్యా..

ఈ చిత్రంలో నడవలేని స్థితిలో మంచంపై కూర్చొని ఉన్న వృద్ధురాలి పేరు రామలక్షుమ్మ. వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఎస్‌బీఐ కాలనీలో ఉంటోంది. ఆ ప్రాంత వలంటీర్ భాస్కర్ ఉదయాన్నే ఆ వృద్ధురాలి ఇంటికి వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. దీంతో రామలక్షుమ్మ సంతోషం వ్యక్తం చేసింది. 'మా జగనయ్య మా కోసం వలంటీర్‌లను పెట్టారు. ఇంటి వద్దకే పింఛన్‌ను పంపిస్తున్నారు. నా మనవడు చల్లగా ఉండాలయ్యా' అంటూ దీవించింది.



రామలక్షుమ్మకు నగదును అందజేస్తున్న వలంటీర్

నంద్యాలలో పింఛన్ అందజేత

బద్వేలు: పోరుమామిళ్ల మండలం రంగసముద్రానికి చెందిన శ్రీరామ రూతమ్మ అనారోగ్యంతో బాధ పడుతూ గిద్దలూరులో తన కుమార్తె వద్ద ఉంటోంది. కర్నూలులో వైద్యానికి వెళుతున్నానని పింఛన్ నగదు అవసరమని ఫోన్ చేసి వలంటీరు అంజిని అడిగింది. మంగళవారం ఉదయాన్నే అంజి గిద్దలూరు వెళ్లే సరికి తన మామ సుంకయ్యతో కలిసి కర్నూలుకు బయలుదేరింది. అంజి వారికి ఫోన్ చేయగా తాము నంద్యాల సమీపంలో ఉన్నామని చెప్పారు. వారిని అక్కడే ఆగాలని సూచించి ద్విచక్ర వాహనంపై వెళ్లిన అంజి పింఛన్ నగదు అందజేశారు. రూతమ్మతో పాటు సుంకయ్య కూడా పింఛన్‌దారుడే కావడంతో ఇద్దరికీ అందజేశారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి వలంటీరు అంజిని అభినందించారు.



రూతమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీరు అంజి

హరిప్రియ ఎక్స్‌ప్రెస్ ప్రయాణ దూరం తగ్గింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: తిరుపతి-కొల్హాపూర్-తిరుపతి మధ్య నడుస్తున్న హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైలు లోండా-మీరజ్ జంక్షన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతుండడంతో ఎనిమిది రోజులపాటు కుదించారని కడప రైల్వేస్టేషన్ మేనేజర్ డీఎస్ రెడ్డి, చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష తెలిపారు. నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు తిరుపతి నుంచి బెల్గావి వరకు మాత్రమే నడుస్తుందన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో ఈనెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు బెల్గావి-తిరుపతిల మధ్య నడుస్తుందన్నారు.

క్లుప్తంగా

ఒంగోలులో దువ్వూరు వాసి మృతి


చంద్రమోహన్ రెడ్డి (ఫైల్)

దువ్వూరు : మండలంలోని మురళీనగర్ గ్రామానికి చెందిన చింతకుంట చంద్ర మోహన్‌రెడ్డి (34) ఒంగోలులో బైపాస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో మంగళవారం మృతి చెందాడు. చంద్రమోహన్‌రెడ్డి తన పనుల నిమిత్తం ఒంగోలుకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. ఒంగోలు బైపాస్‌లో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన ఒంగోలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చంద్రమోహన్‌రెడ్డి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

రిమ్స్‌లో రెండు గుర్తుతెలియని మృతదేహాలు



కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో వైద్య సేవలు పొందుతూ ఇద్దరు రెండు రోజుల వ్యవధిలో మృతి చెందారు. వారి మృతదేహాలను రిమ్స్ మార్చురీలో వుంచామని, ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన మల్లికార్జున

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని పులివెందుల రోడ్డు సమీపంలో రాజీవ్ నగర్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లికార్జున అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ వద్ద సూపర్ ఎక్సెల్‌లో వెళుతున్న ఓ వ్యక్తిని వెనుక వైపు నుంచి బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వేముల మండలం భూమయ్యగారిపల్లెకు చెందిన మల్లికార్జున అనే వ్యక్తి మృతి చెందాడు. వేంపల్లె నుంచి తన గ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగం పేరిట మోసం

కడప అర్బన్ : జిల్లాలోని ప్రొద్దుటూరు నివాసి ఎస్.గౌసియ జిలాన్ అనే మహిళ ఉద్యోగం కోసం జిల్లా కలెక్టరేట్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో టైపిస్ట్‌గా పని చేస్తున్న పి. శివప్రసాద్‌కు రూ.35 లక్షలు ఇచ్చి మోసపోయామని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి నిందితుడిని విధుల నుంచి తొలగించారు. కేసు నమోదు చేసి విచారణ జరిపి బాధితురాలికి తగిన న్యాయం చేయాలని కడప వన్‌టౌన్ సీఐకి ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి బాధితులు ఎవరైనా వుంటే ఈ నెల 6వ తేదీన ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయవచ్చని, ఇలాంటి ఉద్యోగాల పేరుతో డబ్బులు ఇచ్చి మోసపోవద్దని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ తెలియజేశారు.

భక్తికి ప్రతీక.. మతసామరస్యానికి వేదిక

- కమలాపురం దర్గా ఉరుసు నేడు ప్రారంభం
- 5న నషాన్, 6న గంధం
- 7న ఉరుసు, 8న తహలిల్‌తో ముగింపు

కమలాపురం : కమలాపురం పెద్ద దర్గా ప్రత్యేక విశిష్టత సంతరించుకుంది. భక్తికి ప్రతీకగా, మతసామరస్యానికి వేదికగా నిలుస్తోంది. పట్టణంలో వెలసిన దర్గా-ఏ-గఫారియా, ఖాదరియా భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన ఈ దర్గాలో.. శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్‌షాఖాద్రి, శ్రీ హజరత్ దస్తగిరిషాఖాద్రి, శ్రీ హజరత్ మౌలానా మౌల్వి ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి , శ్రీ హజరత్ జహీరుద్దీన్ షాఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్లు వెలసి ఉన్నారు. ఏటా ఈ ఉరుసు మహోత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దివంగత పీఠాధిపతి హజరత్ హాజి జహీరుద్దీన్ షా ఖాద్రి ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఆయన పరమ పదించిన తర్వాత వారసులు, ముతవల్లి సజ్జాదె-ఏ-నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, వారి సోదరుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ నెల 5వ తేదీ(బుధవారం) నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించేందుకు దర్గా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. 5న నషాన్‌తో 103వ ఉరుసు మహోత్సవాలు ప్రారంభమై, 6న గంధం, 7న ఉరుసు, 8న తహలిల్‌తో కార్యక్రమాలు ముగుస్తాయి. ఉత్సవాలకు దర్గా సుందరంగా ముస్తాబు అవుతోంది. రాష్ట్రం నలు మూలల నుంచే కాక తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలి రానున్నారు. భక్తుల సౌకర్యార్థం ముతవల్లి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.



కమలాపురంలోని హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గా

హిందువులు నిర్మించిన దర్గా

హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గాను హిందువులే నిర్మించడంతో.. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. హజరత్ దస్తగిరిషా ఖాద్రికి ముఖ్య శిష్యుడిగా ఉన్న నామా నాగయ్య శ్రేష్ఠి ధర్మకర్తగా కొనసాగారు.

గొప్ప ఖవ్వాలి

దర్గా ప్రాంగణంలో గంధం, ఉరుసు సందర్భంగా రెండు రోజుల పాటు గొప్ప ఖవ్వాలి పోటీ నిర్వహించనున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఉస్తాద్ సలీం రుఖ్‌కార్, సరఫరాజ్ చిష్టిల మధ్య గొప్ప ఖవ్వాలి పోటీ జరుగుతుందని, ఖవ్వాలి ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

7న బండలాగుడు పోటీలు

దర్గా ప్రాంగణంలో ఈ నెల7న పాల దంతాలు కలిగిన వృషభ రాజములచే చిన్న బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నారు. పోటీల్లో పాల్గొనే ఎద్ల యజమానులు 7వ తేదీ ఉదయం 7 గంటల్లోపు దర్గా-ఏ-గఫారియా ఆఫీసులో లేదా 97011 23459 ఫోన్ నంబర్‌కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.


హాజి జహీరుద్దీన్ షా ఖాద్రి, దివంగత పీఠాధిపతి


ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, దర్గా ముతవల్లి

అన్నదానం

నషాన్ రోజున టి.హుసేన్ మియ్యా, గంధం, ఉరుసు రోజుల్లో మోహన్ బీడి యజమాని మహబూబ్ సాహెబ్ కుటుంబ సభ్యులు అన్నదానం చేయనున్నారు.

విశిష్టత

కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం నుంచి మత ప్రబోధనలు చేస్తూ వచ్చిన హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి 1916లో కమలాపురం వచ్చి స్థిర పడ్డారు. ఆయన తన భక్తులకు బోధనలు చేస్తూ ఎన్నో మహిమలు చూపారు. దీంతో ఈ ప్రాంతంలో చాలా మంది ఆయనకు శిష్యులుగా మారారు. ఈ నేపథ్యంలో పరిపూర్ణులై విరాజిల్లుతున్న గఫార్ షా ఖాద్రి తన ప్రియ శిష్యుడైన దస్తగిరిషా ఖాద్రికి గురుత్వం బోధించి 1924 జనవరి 10న సమాధి అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దస్తగిరిషా ఖాద్రి వంశీయులే పీఠాధిపతులుగా కొనసాగుతున్నారు. దాదాపు 50 ఏళ్లకు పైగా పీఠాధిపతిగా కొనసాగిన హజరత్ హాజీ జహీరుద్దీన్ షా ఖాద్రి వల్లి అల్లాగా ప్రసిద్ధికెక్కారు. ఆయన ఇటీవల పరమపదించారు. దీంతో ఆయన కుమారుడు ఫైజుల్ గఫార్‌షా ఖాద్రి గురుతర బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.


స్వామి వారి మజార్లు

ప్రొటోకాల్ పాటించాలని ఉత్తర్వులు

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా-ఏ-గఫారియా, ఖాదరియాకు ఇక నుంచి ప్రతి ఏటా ఉరుసు ఉత్సవానికి ప్రభుత్వం తరఫున చాదర్ సమర్పించాలని ఉత్తర్వులు విడుదల చేసినట్లు ముతవల్లి సోదరులు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఇస్మాయిల్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరుగుతున్న ఉరుసు మహోత్సవానికి ప్రభుత్వం తరఫున ప్రొటోకాల్ లాంఛనాలతోపాటు చాదర్‌ను సమర్పించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టేట్ వక్ఫ్‌బోర్డ్ కార్యనిర్వహణ అధికారి నుంచి జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు అందాయన్నారు. ఈ ఉత్తర్వుల పట్ల పట్టణ ప్రజలు, స్వామి భక్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఏఎల్ కాలనీలో మూడు రోజుల క్రితం ఒక ఇంటిలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కడప రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, సీకేదిన్నె ఎస్ఐ బి.అరుణ్‌రెడ్డి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుమ్మల్ల వెంకట సుబ్బయ్య అలియాస్ శేషు అనే వ్యక్తిని సోమవారం కడప నగర సమీపంలోని సాక్షి సర్కిల్‌లో తమ సిబ్బందితోపాటు కలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతనిపై కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల్లోని పలు పోలీస్‌స్టేషన్‌లలో చోరీ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎర్రచందనం సైతం తరలిస్తూ పలుమార్లు పట్టుబడి శిక్షను అనుభవించాడన్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.1,90,000 వేల విలువ చేసే 38 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దొంగతనం కేసును వెంటనే ఛేదించి బంగారును రికవరీ చేసినందుకు కడప డీఎస్పీ బి.వి.శివారెడ్డి సిబ్బందికి అభినందనలు తెలిపారు.

కూలి పనికి వచ్చి.. బాలకార్మికురాలు బలి

మిద్దెపై నుంచి పడి.. విద్యుత్ తీగలు తగిలి మృతి

నందలూరు (రాజంపేట) : ఇల్లు గడవడం కోసం కూలి పనికి వచ్చిన ఓ బాలకార్మికులు మంగళవారం మృత్యువాత పడింది. జీవనోపాధి కోసం నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం హరికేన్ తండాకు చెందిన మూరే రమేష్‌నాయక్ 20 ఏళ్ల క్రితం రాజంపేట వచ్చారు. ఆయన ఉస్మాన్‌నగర్‌లో కుటుంబంతో పాటు నివసిస్తున్నారు. వారికి ఉన్న ఒక్క గాని ఒక్క కూతురు పద్మావతి బాయ్ (15) కడప-రేణిగుంట నేషనల్ హైవేలోని నందలూరు వైఎస్సార్ విగ్రహ సమీపంలో నేహా ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సలీం భవన నిర్మాణ కూలి పనులకు వచ్చింది. మేస్త్రీ తిమ్మయ్య పిలుపు మేరకు తన చిన్నమ్మతోపాటు వచ్చింది. పనులలో భాగంగా టిఫిన్ చేసి చేతులు కడుగుతుండగా కళ్లు తిరిగి పడిందని స్థానికులు చెబుతున్నారు. పడే క్రమంలో విద్యుత్ తీగలు కూడా బాలకార్మికురాలను బలి తీసుకున్నాయని సమాచారం. సంఘటన స్థలాన్ని రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య పరిశీలించారు. మృతి చెందడానికి కారణాలను అన్వేషించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు రాజంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని ఆయన పేర్కొన్నారు.


ప్రమాదానికి కారణమైన భవనం (ఇన్‌సెట్) పద్మావతి బాయ్ (ఫైల్)

భద్రతా చర్యలు లేకుండానే పనులు

భవన నిర్మాణ పనుల్లో ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోవడం వల్లే మైనర్‌బాలిక ప్రాణం బలిగొందనే విమర్శలున్నాయి. మైనర్ బాలికతో పని చేయించుకుంటే కార్మికశాఖ నిద్రావస్థలో ఉన్నట్లు కనిపిస్తోంది. బాలకార్మికల చట్టం కింద భవనం యజమాని, కాంట్రాక్టరుపై ఎటువంటి కేసులు నమోదు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెలువడుతున్నాయి.

ఆటో, కారు ఢీకొని తల్లీబిడ్డలు మృతి

రాయచోటి టౌన్ (సుండుపల్లె) : ఆటో, కారు ఢీకొనడంతో తల్లీబిడ్డలు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. టి.సుండుపల్లె ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం రాయచోటి నుంచి సుండుపల్లెకు ఆటో వెళ్తోంది. ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేయబోయి అలాగే కుడివైపు ముందుకెళ్లాడు. ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టి కుడివైపున ఉన్న గుంతలో పడిపోవడంతో.. ఆటోలో ఉన్న సుండుపల్లె మండలం భాగ్యంపల్లెకు చెందిన షేక్ ఫరీదాతో (27)పాటు ఆమె చంటిబిడ్డ (రెండు నెలల వయసు) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేందుకు స్థానికులు, పోలీసులు ప్రయత్నించగా.. అప్పటికే వారు ఇద్దరు మృతి చెందారు. మృతదేహాలను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. అలాగే ఆటో ఉన్న మరో నలుగురికి గాయాలు అయ్యాయి. వీరిని చికిత్స కోసం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.


మృతి చెందిన ఫరీదా, ఆమె కుమారుడు

నానోటెక్నాలజీ పరిశోధకుడికి అభినందన

రూ.25 లక్షల వార్షిక ప్యాకేజీతో దక్షిణకొరియాలో ఉద్యోగ అవకాశం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం మెటీరియల్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ పరిశోధకుడు వి.భార్గవ్ దక్షిణకొరియాలోని జేన్‌బుక్ నేషనల్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టరోల్ ఫెలోగా ఎంపిక కావడం పట్ల విశ్వవిద్యాలయ అధికారులు అభినందించారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో ఆయనకు వీసీ ఆచార్య జింక రంగజనార్ధన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ కీర్తి పెంచేలా దక్షిణకొరియాలో బ్రెయిన్ కొరియా ప్రోగ్రాం (బీకే21)లో పోస్ట్ డాక్టర్ ఫెలోగా రూ. 25 లక్షల వార్షిక వేతనం పొందడం అభినందనీయమన్నారు. కాగా భార్గవ్ వైవీయూ నానోటెక్నాలజీ సహ ఆచార్యులు డా.మమతకుమారి పర్యవేక్షణలో డీఆర్‌డీఓ/నావెల్ రీసెర్చ్ బోర్డు సహకారంతో జెడ్‌స్కిన్ నానోకాంపోజిట్స్ హైడ్రోజన్ ప్రొడ్యూస్ అన్న అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నారు. పీజీ కూడా వైవీయూలోనే పూర్తి చేశారు. ఈయన రాసిన పలు పరిశోధన పత్రాలు పలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈయన స్వగ్రామం ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం వలేటివారిపాలెం. కార్యక్రమంలో అధ్యాపకులు ఆచార్య ఎం.వి. శంకర్, డాక్టర్ విజయ్‌కుమార్‌నాయుడు, డాక్టర్ ఎస్. ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భార్గవ్‌ను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం : ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యం కోసం ఇష్టపడి చదవాలని జిల్లా సమగ్ర శిక్షప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సిద్దవటం మండలంలోని పార్వతీపురంలో ఉన్న శ్రీ ఎస్‌బీవీడీ సభా హైస్కూల్(ఎయిడెడ్ పాఠశాల)ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భుజించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రెగ్యులర్ పాఠ్య పుస్తకాలే గాకుండా సమాజం గురించి, సమాజంలో జరిగే సంఘటనల గురించి తెలుసుకోవాలన్నారు. పాఠశాల కరస్పాండెంటు మధుసూదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన అసిస్టెంట్ డైరెక్టర్ మృతి


శివశంకర్‌రాజు (ఫైల్)

చిట్వేలి : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని పత్తిగుంటవారిపల్లెకు చెందిన సినీ అసిస్టెంట్ డైరెక్టర్ ఉప్పలపాటి శివశంకర్‌రాజు (45) మంగళవారం మృతి చెందాడు. శివశంకర్‌రాజు డిగ్రీ పూర్తి కాగానే డైరెక్టర్ కావాలన్న లక్ష్యంతో సినీ పరిశ్రమకు వెళ్లాడు. అక్కినేని నాగచైతన్య నటించిన శైలజారెడ్డి చిత్రంతో పాటు పలు చిత్రాలకు, సీరియల్స్‌కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఇదిలా వుంటే ఈనెల 3వ తేదీ షూటింగ్‌కు బైక్‌లో వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివశంకర్‌రాజు మృతితో పత్తిగుంటవారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మదనపల్లె మండలంలో యువకుడు..

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలోని కనుమలోగంగమ్మ ఆలయ సమీపంలో ఈ నెల 2వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని నిమ్మనపల్లె క్రాస్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థి అఫ్రోజ్ అక్కడికక్కడే మృతి చెందగా, ఇదే ప్రమాదంలో అతని స్నేహితుడు బసినికొండకు చెందిన పవన్‌కుమార్ (24) తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడికి జిల్లా ఆసుపత్రిలో వైద్య చికిత్సల అనంతరం మెరుగైన వైద్య సేవలకు తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. 2వ తేదీన అఫ్రోజ్, పవన్‌కుమార్‌లు ద్విచక్ర వాహనంలో కనుమలో గంగమ్మ ఆలయ సమీపంలో ముందు వెళ్లే వాహనాన్ని అధిగమించే క్రమంలో.. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు.

నీటి కుంటలో మునిగి వ్యక్తి మృతి

నిమ్మనపల్లె : వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు నీటి కుంటలో ఈత ఆడేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. పెద్దమాదిగపల్లెకు చెందిన పి.సుధాకర (35) మంగళవారం మధ్యాహ్నం గ్రామానికి సమీపంలో కందూరు రోడ్డు పక్కన ఉన్న దామర ఒడ్డు నీటి కుంటలో ఈతకు వెళ్లాడు. ఒక ఒడ్డు నుంచి మరో ఒడ్డుకు ఈదుతూ వస్తుండగా అకస్మాత్తుగా ప్రమాదవశాత్తు నీట మునిగాడు. దీనిని గమనించిన స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినా అప్పటికే నీటి అడుగుభాగానికి చేరాడు. దీంతో స్థానికులు వెంటనే సమాచారాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులు, వాల్మీకిపురం అగ్నిమాపక కేంద్రానికి అందజేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సీఆర్.మంజుల, పోలీసు సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు శ్రమించినా మృతదేహాన్ని బయటకు తీయడం సాధ్యం కాలేదు. మృతుడు సుధాకర్ ప్రకాశం జిల్లా దర్శి పట్టణానికి చెందినవాడు కాగా 15 ఏళ్ల క్రితం పెద్దమాదిగపల్లెకు చెందిన శశికళను ప్రేమ వివాహం చేసుకుని స్థానికంగా స్థిరపడ్డాడు. కొద్ది రోజులు గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేశాడు. ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికునిగా పని చేసేవాడు. మృతునికి ముగ్గురు కుమారులు ఉన్నారు. నీటి కుంటలో భర్త మునిగిన విషయం తెలుసుకున్న భార్య శశికళ పిల్లలతోపాటు చేరుకుని గట్టుపై విలపించడం పలువురిని తీవ్రంగా కలచి వేసింది. శశికళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాధవరం పీహెచ్‌సీ తనిఖీ

సిద్దవటం : మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించామన్నారు. కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. సచివాలయాల పరిధిలో బీపీ, షుగర్, అనుమానితుల కేసులను పరీక్షించి అవసరమైన వారికి ఒక నెలకు సరిపడా మందులను ఇవ్వాలని ఆదేశించామన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స తీసుకొని డిశ్చార్జి అయిన వారిని పరామర్శించి యాప్‌లలో నమోదు చేయాలన్నారు. డాక్టర్ శివకుమార్, డాక్టర్ సునీత, సూపర్‌వైజర్లు నాగవల్లి, జ్యోతికళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో మేయర్ సురేష్ బాబు, తదితరులు

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : 'జగనన్నే మా భవిష్యత్' నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక అపూర్వ కల్యాణ మండపంలో కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, సచివాలయ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి ఐదేళ్లు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఏం మేలు చేసిందో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి కుటుంబానికి మేలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఎన్నికలకు ఒక ఏడాది మాత్రమే ఉన్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు.. ప్రజలకు ఇంకా దగ్గర కావాలని, వారు ఏం కోరుకుంటున్నారో తెలుసుకోవాలన్నారు. వైఎస్ కుటుంబాన్ని నమ్ముకున్న వారికి ఎప్పటికీ అన్యాయం జరగదని తెలిపారు. ఈనెల 7వ తేది నుంచి 20వ తేది వరకూ ఇంటింటికీ వెళ్లి వారితో పదిహేను నిమిషాలు మాట్లాడి ఈ ప్రభుత్వ పనితీరును తెలుసుకోవాలన్నారు.

కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చింది వైఎస్సార్‌సీపీనే : మేయర్

కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చింది వైఎస్సార్‌సీపీయేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె.సురేష్ బాబు అన్నారు. పార్టీలో కష్టపడిన వారందరికీ పదవులు ఇచ్చారని, రాబోవు రోజుల్లో మరింత మందికి వస్తాయన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా జగనన్న ప్రభుత్వాన్ని తిరిగి తెచ్చుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జయచంద్రారెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, జోన్ కన్వీనర్లు మల్లికార్జున, షఫీ, రామలక్ష్మణ్‌రెడ్డి, రెడ్డిప్రసాద్, కార్పొరేటర్లు సానపురెడ్డి శివకోటిరెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు జమాల్‌వలీ, సీహెచ్ వినోద్, శ్రీరంజన్‌రెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌వీ రమణ, సుబ్బరాయుడు, మరియలు తదితరులు పాల్గొన్నారు.